క్లుప్తంగా

కెంచమాంబదేవికి 'కాసుల హారం'



దాతలు బహూకరించిన కాసుల హారం

అమరాపురం: మండల పరిధిలోని గొడనకుంట గ్రామంలో వెలసిన కెంచమాంబదేవి అమ్మవారికి కర్ణాటక రాష్ట్రం మరిదాసనహళ్లికి చెందిన జానకలు గోత్రానికి చెందిన ఆడబిడ్డలు బంగారు కాసుల హారాన్ని బహూకరించారు. ఇందులో భాగంగానే బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు కాసుల హారం అందజేశారు. నూతనంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో అమ్మవారికి కాసుల హారాన్ని సమర్పించినట్లు దాతలు తెలిపారు. రూ.2 లక్షల విలువైన ఆభరణాన్ని అందించిన మహిళలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే కోసం వాహనాల తనిఖీ

పెనుకొండ: రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోసం పోలీసులు 44వ జాతీయ రహదారిపై బుధవారం పెద్ద ఎత్తున వాహనాలను సోదా చేశారు. మాజీ ఎమ్మెల్యే హైవే మీదుగా వస్తున్నాడన్న సమాచారంతో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి వాహనాలను పరిశీలించారు. పోలీసులు ఒక్కసారిగా వాహనాలను నిలిపి తనిఖీ చేయడంతో చర్చనీయాంశమైంది. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

వీరభద్రుని సేవలో పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్



సుబ్బారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయాన్ని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, 10వ తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకులు సుబ్బారావు బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రకళను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేక పూజలు చేయించారు.

నీటి సమస్య పరిష్కారం



బోరులో నీళ్లు సమృద్ధిగా వస్తున్న దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ అనిత, వైఎస్సార్‌సీపీ తాలూకా బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పరిష్కరించారు. నిలిచి పోయిన బోరుబావికి మరమత్తు చేయడంతో నీళ్లు సమృద్ధిగా వచ్చాయి. పండుగ సమయంలో కాలనీకి నీటి సమస్య తీర్చినందుకు సర్పంచుతో పాటు నాయకుడు నాగేంద్రకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా దొడ్డేరి పంచాయతీలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కరస్పాండెంట్‌ను కఠినంగా శిక్షించాలి

గోరంట్ల: గిరిజన విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన గోరంట్ల పట్టణానికి చెందిన నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీపతిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత బంజారా సేవా సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షుడు, గోరంట్ల జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువే నీచంగా ప్రవర్తించడం దారుణమన్నారు. కరస్పాండెంట్ లక్ష్మీపతిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. అలాగే నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల గుర్తింపును రద్దు చేయాలన్నారు. పాఠశాలపై చర్యలు తీసుకోకపోతే బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

పుట్టపర్తి టౌన్: గోరంట్లలోని నారాయణ, లయోలా పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం పుట్టపర్తిలోని ప్రగతిశీల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గోరంట్లలో సదరు పాఠశాలలను ఒక వ్యక్తి గుప్పెట్లో పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా తరగతులు, అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

కనిపించని ఉగాది సందడి

తెలుగు సంవత్సరాది ఉగాది. పల్లె నుంచి పట్నం దాకా ప్రజలందరూ ఎంతో ఘనంగా జరుపుకునే పండుగ ఇది. ఉగాది దగ్గర పడుతున్నా ఆ సందడి మాత్రం ఎక్కడా కనిపించడం లేదు.

- అమలు కాని సూపర్ సిక్స్ పథకాలు
- వెలవెలబోతున్న కిరాణా, వస్త్ర దుకాణాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్న ప్రజలు



నిర్మానుష్యంగా ఉన్న జమ్మానిపల్లి

మడకశిరరూరల్: మడకశిర ప్రాంతంలో ఉగాది సందడి ఎక్కడా కనిపించడం లేదు. ఈ నెల 30న ఉగాది పండుగను ప్రజలు జరుపుకోనున్నారు. మడకశిర నియోజకవర్గంలో వర్షాధారిత పంటలపైనే ఆధారపడి ఎక్కువ మంది రైతులు జీవనం సాగిస్తున్నారు. అయితే పెట్టుబడి సాయం అందక రైతులందరూ అప్పులు చేసి పంటలు సాగు చేశారు. పంట కూడా సరిగ్గా పండకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.


అటకెక్కిన సంక్షేమం

ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కూటమి నాయకులు సూపర్ సిక్స్ హామీలను గుప్పించారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయలేదు. దీంతో రైతులు మొదలు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో అప్పులు చేసి పంటలను సాగు చేసిన వేరుశనగ పంట వర్షాభావ పరిస్థితుల కారణంగా చేతికి అందకపోవడంతో రైతులు కష్టాల్లో పడ్డారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం ఖాతాల్లోకి జమ చేయకపోవడంతో అప్పులు చేసి రబీలో కూడా పంటలు సాగు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయి. ఫలితంగా ఉగాది పండుగను ఆశించిన స్థాయిలో చేసుకోలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడంతో వారు కూడా నిరాశలో ఉన్నారు. ఇతర వర్గాలకు ఇచ్చిన హామీలను కూడా కూటమి ప్రభుత్వం నిలుపుకోకపోవడంతో పండుగకు దూరమవ్వాల్సిన దుస్థితి నెలకొంది.

గతం ఎంతో ఘనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి నెలా ఏదో ఒక సంక్షేమ పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు పడేవి. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ పక్కాగా అమలు చేయడంతో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా పండుగలను కూడా జరుపుకునేవారు. మరీముఖ్యంగా అన్నం పెట్టే రైతులను పెట్టుబడి సాయంతో పాటు పంట కొనుగోలు వరకూ ప్రతి విషయంలో అండగా ఉండేవారు. దీంతో కర్షకులు సంతోషంగా పండుగ చేసుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సంక్షేమాన్ని అటకెక్కించడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలందరూ గుర్తుచేసుకుంటున్నారు.

కళతప్పిన దుస్తులు, సరుకుల దుకాణాలు



మడకశిరలో వెలవెలబోతున్న ఓ కిరాణా షాపు

ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఉగాది పండుగకు కొత్త బట్టల కొనుగోలుపై ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దీనికితోడు పెరిగిన నిత్యావసర ధరల కారణంగా కిరాణా సరుకులను కూడా నామమాత్రంగా కొనుగోలు చేయడానికి ముందుకొస్తున్నారు. వస్త్రదుకాణాలు, కిరాణా షాపుల్లో వ్యాపారం ఆశించిన స్థాయిలో జరగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో కిరాణా షాపులు వెలవెలబోతున్నాయి. వస్త్ర దుకాణాల్లో కూడా వ్యాపారం పూర్తిగా పడిపోయింది. పట్టణ ప్రాంతాల్లో కొంత వరకూ ఉగాది సందడి కనిపించినా గ్రామాల్లో ఈ పండుగపై ప్రజలు పెద్దగా ఉత్సాహం చూపడం లేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను 9 నెలలు గడుస్తున్నా అమలు చేయకపోవడంతో ఉగాదికి కూడా సందడి కనిపించడం లేదు.

ఉన్న దాంట్లోనే పండుగ



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అయినా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడంతో ప్రజల చేతిలో డబ్బులు లేకుండా పోయాయి. దీంతో ఉన్న దాంట్లోనే పండుగను జరుపుకోవాల్సి వస్తోంది. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పండుగకు అవసరమయ్యే సరుకులను తక్కువగా కొనుగోలు చేసి పండుగను జరుపుకోవాల్సిన పరిస్థితి. గత ఏడాది ఆనందంతో ఉగాది పండుగను జరుపుకున్నాం. ఈ ఏడాది అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు.
– నటరాజ్, హారేసముద్రం, మడకశిర మండలం

డబ్బులు లేక ఇబ్బందులు



ఉగాది పండుగా చేసుకోవడానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం విస్మరించింది. సంక్షేమ పథకాలు అమలు చేసి ఉంటే కొంత వరకూ ఇబ్బంది ఉండేది కాదు. గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్ ముగుస్తున్నా అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వం పెట్టుబడి సాయం ఖాతాలోకి జమ చేయకపోవడం బాధాకరం.
– శేషాద్రి, చందకచెర్లు, మడకశిర మండలం

అప్పులు చేయక తప్పదు



ఈ ఏడాది ఉగాది పండుగకు అప్పులు చేయక తప్పేలా లేదు. సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలు చేయకపోవడంతో చేతిలో డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాం. విధిలేని పరిస్థితిలో అప్పులు చేసి పండుగకు ఉపయోగించే సరుకులు, పిల్లలకు కొత్త బట్టలను కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో ఎంతో ఉత్సాహంతో పండుగ జరుపుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడంలేదు.
– రంగనాథ్, టీడీపల్లి, మడకశిర మండలం

పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

గోరంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గౌనివారిపల్లి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీతో పాటు వివిధ అనుబంధ సంఘాల కమిటీలను మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఉషశ్రీచరణ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చి మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

నూతన కమిటీ ఎంపిక

గౌనివారిపల్లి పంచాయతీ గ్రామ అధ్యక్షుడిగా మధుసుధనరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కిరణ్‌బాబు, మహిళా విభాగపు అధ్యక్షురాలిగా మహాలక్ష్మి, బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఆదెప్ప, బూత్ కమిటీ ఉపాధ్యక్షులుగా అక్కులప్ప, లక్ష్మణ్ , బీసీ సెల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా సురేష్, సాయికృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మహేష్, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా వలిబాషా, విద్యార్థి విభాగపు అధ్యక్షుడిగా సాయినాథరెడ్డి , రైతు విభాగం అధ్యక్షుడిగా సుధాకరరెడ్డి , సోషల్ మీడియా అధ్యక్షుడిగా వై సునీల్‌కుమార్‌రెడ్డిని ఎంపిక చేశారు. వీరితో పాటు వివిధ విభాగలకు కమిటీలను నియమించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

మడకశిర: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక సీడీపీఓ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో పోషణ్ బీ-పడాయి బీ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐఆర్‌సీటీ బుచ్చయ్యనాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరుకానున్న దివ్యాంగులకు చదువుపై ఆసక్తి కలిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీ, మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు 'పోషణ్ బీ-పఢాయి బీ' కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, సూపర్ వైజర్ సన్నమ్మ, ఐఆర్టీ శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా రవి



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రమైన రొద్దంలో నాయీ బ్రాహ్మణుల సంఘం కమిటీ సభ్యులను బుధవారం ఘనంగా సన్మానించారు. నాయీ బ్రాహ్మణుల నూతన కమిటీని ఎన్నుకోవడంతో గత కమిటీలో అధ్యక్షుడిగా పనిచేసిన నాగరాజు, సలహాదారుడు త్యాగరాజును శాలువాలతో సత్కరించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా రవి, ఉపాధ్యక్షుడిగా మంజునాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంగా పలువురు నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ





విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) అలంకరణలో కెంచమాంబదేవి

అమరాపురం: మండల పరిధిలోని గొడనకుంటలో వెలసిన కెంచమాంబదేవికి బుధవారం మండల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులు పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా బండారు చెట్టు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజల అనంతరం డప్పు వాయిద్యాలతో యువకులు నృత్యం చేస్తూ ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

భక్తితోనే ముక్తి

ప్రజలు భక్తి భావంతో పూజలు చేయడం ద్వారా ముక్తి మార్గం పొందవచ్చని కర్ణాటక రాష్ట్రం కుంచిటిగ యలెరాంపురం పీఠాధిపతి హనుమంతనాథస్వామిజీ పేర్కొన్నారు. బుధవారం గొడనకుంటలో నిర్వహించిన కెంచమాంబదేవి మండల పూజలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

గుడిబండ: వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రాధమ్మ అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. ముందస్తుగా అధికారులు తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల సహాయంతో నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రత్నమ్మ, ఎంపీడీఓ గంగాధర్, ఈఓఆర్డీ నాగరాజునాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

సంతేబిదనూర్‌లో కార్డెన్ సెర్చ్



ప్రజలకు సూచనలిస్తున్న సీఐ ఆంజనేయులు

హిందూపురం: గ్రామ పంచాయతీల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రజల సహకారంతో అడ్డుకట్ట వేస్తామని రూరల్ అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని సంతేబిదనూరులో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో సమావేశమై పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలు, వాహన చట్టాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, శక్తి యాప్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. గ్రామంలో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ అబ్దుల్ కరీం, రూరల్ అప్‌గ్రేడ్ ఎస్‌ఐ ముని ప్రతాప్, వన్ టౌన్ ఎస్‌ఐ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన

లేపాక్షి: మండలంలోని కోడిపల్లిలో భూ రీసర్వేపై తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామసభ జరిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. రీ సర్వే చేయడం వలన కలిగే ప్రయోజనాలను తహసీల్దార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గంగాధర్, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి



సెక్రెటరీ నారాయణకు వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

పరిగి: ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం పరిగిలో పారిశుధ్య కార్మికులతో కలిసి పంచాయతీ సెక్రెటరీ నారాయణకు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక పంచాయతీ నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే నెలలు గడచిపోతున్నా కార్మికుల జీతాలు కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. పండుగల నేపథ్యంలో వెంటనే జీతాలు చెల్లించాలన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ కేశవరావు తెలిపారు. సీసీ టీవీ ఇన్‌స్టలేషన్, మొబైల్ రిపేరీ, కంప్యూటర్ కోచింగ్, కమ్యూనికేషన్ స్కిల్‌పై శిక్షణ ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం

పావగడ మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

పావగడ: స్థానిక మున్సిపాలిటీకి సంబంధించి 2025-26 బడ్జెట్ అందర్నీ మురిపించింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం నూతన మీటింగ్ హాల్‌లో బడ్జెట్ సమావేశాలు బుధవారం నిర్వహించారు. మున్సిపల్ అధ్యక్షుడు పీహెచ్ రాజేశ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆదాయం రూ 670.65 లక్షలుగా పేర్కొన్నారు. ఖర్చు రూ.639.02 లక్షలుగా ఉందన్నారు. రూ 31.63 లక్షలు మిగులు బడ్జెట్‌గా ఉందన్నారు. బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు.

నేడు మండల మీట్

రొళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో గురువారం ఉదయం 10.30 గంటలకు సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామరావు తెలిపారు. సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజుతో పాటు ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్ హాజరు కావాలని కోరారు. అదేవిధంగా మండల స్థాయి అధికారులు గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించి చర్చించిన అంశాలకు సంబంధించి పరిష్కారమైన సమస్యల నివేదికలతో పాటు ప్రగతి నివేదికలతో తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య అవసరం

అగళి: మండలంలో ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని ఏడీఏ కృష్ణమీనన్ అన్నారు. మండలంలోని అగళి, ఇరిగేపల్లి రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోకపోతే భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు అందవన్నారు.

'నారాయణ' అనుమతులు రద్దుచేయాలి

గోరంట్ల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, ఏఐఎస్బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య, ఏఐఎస్ఓ జిల్లా కార్యదర్శి నిరంజన్ , పీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్ర డిమాండ్ చేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని కరస్పాండెంట్ లక్ష్మీపతి లైంగికంగా వేధించడం దారుణమన్నారు. వెంటనే అతన్ని కఠినంగా శిక్షించాలన్నారు. మండల కేంద్రంలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల యాజమాన్యం హాస్టల్ పర్మిషన్ లేకుండానే హాస్టల్ నిర్వహిస్తోందన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	36.0
పెనుకొండ	39.0
మడకశిర	36.0

దాడిలో వ్యక్తికి గాయాలు



గాయపడిన వడ్డే చంద్రశేఖర్

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మంగాపురంలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో వడ్డే చంద్రశేఖర్ అనే వ్యక్తి గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాలమేరకు... తమ బంధువుల మధ్య కొంత కాలంగా భూవివాదం నడుస్తోందన్నారు. ఇందులో భాగంగానే అదే విషయంపై ఇరువర్గాలు ఘర్షణకు దిగాయన్నారు. నారాయణ, రామకృష్ణ, చిరంజీవితో పాటు మరి కొందరు కట్టెలతో ఇతర ఆయుధాలతో దాడి చేయడంతో చంద్రశేఖర్ తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని గ్రామస్తులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు అనంతపురం తరలించారు. పోలీసులు దాడి ఘటనపై విచారిస్తున్నారు.

నేడు ఎంపీపీ ఎన్నిక

రొద్దం: అనారోగ్యంతో రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్ గత ఏడాది మృతి చెందడంతో ఖాళీగా ఉన్న మండల అధ్యక్షుడి ఎన్నిక గురువారం జరగనుంది. ఎన్నిక నిర్వాహనకు ఎన్నికల అధికారి ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 15 ఎంపీటీసీలకుగాను 15 స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. దీంతో నేడు జరిగే ఎంపీపీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ ఎంపీపీ అభ్యర్థిగా నల్లూరు పంచాయతీ ఎంపీటీసీ నాగమ్మను ఎంపీటీసీ సభ్యులు బలపరుస్తున్నట్లు ఆపార్టీ నాయకులు తెలిపారు. ఎంపీపీ ఎన్నిక విషయాన్ని ఎన్నికల అధికారి విజయప్రసాద్, ఎంపీడీఓ రామ్‌కుమార్‌ను కలిసి సమాచారం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నాగమ్మ, వనజ, నాయకులు బి.నారాయణరెడ్డి, తిమ్మయ్య, చిన్నమంతూరు రాము, కలిపి నరేంద్ర, బూదిపల్లి రామచంద్రారెడ్డి, శేషాపురం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వారపు సంత వేలం

లేపాక్షి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు వారపు సంత, బస్టాండులో పార్కింగ్ స్థలం వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సాయిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాట పాడే పాటదారులు పంచాయితీ వారు నిర్ణయించిన ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

పనులపై పర్యవేక్షణ ఏదీ?



పని వద్ద కూలీలు, కాంట్రాక్టర్ కుమారుడు మాత్రమే ఉన్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనుల నిర్మాణాలను అధికారులు సక్రమంగా పర్యవేక్షించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైల్వేస్టేషన్ వరకూ రూ.40 లక్షలతో సీసీ రోడ్డు పనులు జరుగుతుండగా.. కూలీలతో పాటు కాంట్రాక్టర్ కుమారుడు మాత్రమే పని వద్ద ఉన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోతే రోడ్డు నాణ్యత సక్రమంగా వుంటుందా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల రోడ్డుకు అనుసంధానంగా డ్రైనేజ్ నిర్మించినా సక్రమంగా క్యూరింగ్ చేయడం లేదన్న ఆరోపణలున్నాయి.